కృష్ణమ్మ వచ్చె.. రైతన్న మురిసె!

- పోతిరెడ్డిపాడు నుంచి నీరు విడుదల
- వేల ఎకరాల్లో మాగాని పంటల సాగుకు సన్నద్ధం
- రైతన్నల మోములో చిరునవ్వు

ఆత్మకూరు : ఈ ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతన్నలతో వరుణుడు దోబూచులాడుతున్నాడు. వేసిన పంటలు కళ్ల ఎదుటే ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. వర్షం కోసం అన్నదాతలు వెయ్యి కళ్లతో ఎదురు చూసే పరిస్థితి. ఈ తరుణంలో కృష్ణాజలాలు శ్రీశైలం చేరడంతో అన్నదాతలు కొంత ఊరట చెందారు. శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం పెరగడంతో శుక్రవారం పోతిరెడ్డిపాడు నుంచి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్‌లు నీటి విడుదల చేయడంతో జిల్లా వాసులే కాకుండా రాయలసీమ రైతాంగం మోములో చిరునవ్వులు చిందాయి.

తెలుగు గంగకు చేరిన కృష్ణా జలాలు

పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేసిన కృష్ణాజలాలు వెలుగోడు తెలుగు గంగ ప్రాజెక్టుకు చేరుకున్నాయి.



పోతిరెడ్డిపాడు వద్ద స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

బానుక చర్ల క్రస్ట్ గేట్ల నుంచి రోజుకు ఐదు వేల క్యూసెక్కుల నీరు వెలుగోడుకు చేరుకుంది. అలాగే ఎస్ఆర్‌బీసీకి కూడా నీరు విడుదల కావడంతో ఉమ్మడి జిల్లాల రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. వెలుగోడు నీరు రావడంతో శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు, మహానంది, ఆళ్లగడ్డ, మండలాలతో పాటు రాయలసీమ జిల్లాలకు సాగు నీరు తరలివెళ్లనుండడంతో రైతులు మాగాని పంటలు పండించేందుకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో నారుమళ్లను సన్నద్ధం చేస్తున్నారు.

వరి సాగుకు రైతన్నలు సన్నద్ధం

తెలుగు గంగ ఆయకట్టు కింద నంద్యాల జిల్లాతో పాటు ఉమ్మడి వైఎస్సార్, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఐదు లక్షల 75 వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది. ఎస్ఆర్‌బీసీలో మరో లక్ష ఎకరాల దాకా, కేసీ కెనాల్ నుంచి సాగు నీరు విడుదలైతే ఉమ్మడి జిల్లాతో పాటు వైఎస్సార్ జిల్లాల్లో రైతన్నలు లక్షలాది ఎకరాల్లో వరి పంట వేసేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రధానంగ శ్రీశైలం నియోజకవర్గంలోని మూడు మండలాలతో పాటు జిల్లాలోని వివిధ మండలాల్లోని తెలుగు గంగ, కేసీ ఆయకట్టు కింద ఈ పంట సాగు చేయనున్నారు. అధికంగా రైతులు నంద్యాల సోన పంటను వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం పొలాల్లో ట్రాక్టర్ల ద్వార వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు.

మెట్ట పంటలు వేసుకోవాలంటున్న అధికారులు

ఈ ఏడాది శ్రీశైలం డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టంకు చేరుకోకపోవడంతో అధికారులు వరి పంటకు బదులు మెట్టపంటలను సాగు చేయాలని సూచిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ రైతులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా రైతులు నీరు వస్తుందనే ఆశతో వరి సాగుపైనే దృష్టి సారించారు.

రైతన్నల ఆనందంతో ఎంతో సంతృప్తి



ఈ ఏడాది రైతన్నలు వర్షం కోసం ఎదురు చూస్తూ పంటలు వేస్తామా...లేదా అని ఆందోళనకు గురవుతున్నారు. పోతిరెడ్డిపాడుకు నీరు రావడంతో వెంటనే అధికారులతో చర్చించి నీరు విడుదల చేశాం. నీరు విడుదల కావడంతో ఆయకట్టు రైతన్నలో వెల్లువిరిసిన ఆనందం చెప్పనవసరం లేదు. వారి ఆనందంతో ఎంతో సంతృప్తి చెందాను.

– శిల్పాచక్రపాణిరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే

నీరు విడుదల చేయడంతో సంతోషం



సాగునీరు విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఖరీఫ్‌లో అరకొరగా రైతులు సాగు చేసిన కొన్ని పంటలకు ఈ నీరు ఎంతో ఉపయోగకరం. అలాగే మళ్లీ మాగానికి రైతులు సిద్ధం కావడం, పంటలు పండి రైతన్నలు పడే సంతోషంగా అంతా ఇంతా కాదు. పోతిరెడ్డిపాడు వద్ద ఎమ్మెల్యే నీరు విడుదల చేయడంతో ఈ ప్రాంత రైతులు ఎంతో సంబరపడ్డాం. ఆ ఆనందం చెప్పలేనిది.

– శరభారెడ్డి మహానంది

తెలుగు గంగ నీటితోనే పంటలకు అధిక దిగుబడి



మా మండలంలో కేసీ కెనాల్‌తో పాటు తెలుగు గంగ కింద నీరు రావడంతో రైతులు వేసిన పంటల్లో అధిక దిగుబడి సాధిస్తున్నారు. ఏటా వరి పంట ఎకరాకు 35 నుంచి 45 బస్తాల దాకా పంటలు పండిస్తున్నారు. పోతిరెడ్డిపాడు నుంచి నీరు విడుదల చేస్తున్నారంటేనే మా సంతోషం అంతా ఇంతా కాదు. వర్షాలు తక్కువ పడినా.. సాగునీరు ఉందన్న భరోసా రైతులకు ఉంది.

– శ్రీనివాసరెడ్డి, బండిఆత్మకూరు

వరి పంట సాగు చేస్తాం



మాది వెలుగోడు మండలం. తెలుగు గంగ కింద ప్రతి ఏడాది 15 ఎకరాల వరి పంట సాగు చేస్తాం. ఇప్పుడు కూడా పొలాలను సిద్ధం చేశాం. ఈ ఏడాది తెలుగు గంగకు నీరు రావడం ఆలస్యం అయింది. అయినా నీరు వస్తుందని నమ్మకంతో రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. తెలుగు గంగ నుంచి నీరు విడుదల కావడం రైతన్నగా ఎంతో సంతోషంగా ఉంది.

– గోవిందుడు, వెలుగోడు

క్లుప్తంగా

రైతులకు బకాయిల చెల్లింపు



రైతులకు నగదు పంపిణీ చేస్తున్న గ్రామ పెద్దలు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో శివపుల్లయ్య అనే వ్యాపారి నుంచి రైతులకు సంబంధించిన సొమ్మును గ్రామ పెద్దలు వసూలు చేసి శనివారం రైతులకు పంపిణీ చేశారు. గ్రామంలో అప్పు ఉన్న ఒక్కో రైతుకు రూ.లక్షకు రూ.6 వేల చొప్పున 140 మంది రైతులకు ఇరవై లక్షల అరవై వేల రూపాయలను గ్రామ పెద్దలు, పోలీసుల సమక్షంలో గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో రైతులందరికీ అందజేశారు. కార్యక్రమంలో ఎస్.ఐ ఎన్వీ రమణ, సర్పంచ్ నవీన్, గ్రామ పెద్దలు అయ్యన్న, పర్వతాలు, చేపల మహేష్, బాలస్వామి, సీపీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

నందికొట్కూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారులు పరిష్కరించాలని విద్యుత్ కమిటీ చైర్మన్ మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని కొణిదేల గ్రామం వద్దనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సలహామండలి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు కొత్త మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని, పొలాల్లో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలకు మరమ్మతులు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పబ్బతి రవి, బిజినవేముల సర్పంచ్ రవియాదవ్, మండల ఇన్‌చార్జ్ ఓంకార్‌రెడ్డి, కాంతారెడ్డి, విద్యుత్ ఏడీ శ్రీనివాసులు, ఏఈ రాములునాయక్ పాల్గొన్నారు.

సహకార సొసైటీ అధ్యక్షుడికి సన్మానం



వెంకటరమణను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, న్యాయవాది

నందికొట్కూరు: జూపాడుబంగ్లా మండల పరిధిలోని 80 బన్నూర్ సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటరమణను శనివారం న్యాయవాది వెంకటరాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగసురేష్, రాజేష్, సూర్యశివ, సురేష్‌యాదవ్ ఘనంగా సన్మానించారు. వెంకటరమణ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఎంపిక చేసిన రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నమ్మకాన్ని వమ్ముచేయకుండా రైతులకు న్యాయం చేస్తానన్నారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలను రైతులకు చేరవేస్తానని తెలిపారు.

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రాఘురామ్మూర్తి

నందికొట్కూరు: విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఏఐఎస్ఎఫ్‌కి రాజీలేని ఉద్యమాలు చేసిన చరిత్ర ఉందని సీపీఐ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి అన్నారు. ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పటేల్ సెంటర్‌లో ఏఐఎస్ఎఫ్ జెండాను ఎగరవేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం అనేక పోరాటాలు చేయడం జరిగిందన్నారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన ఏకైక, మొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్‌యేనని చెప్పారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి మహానంది, నాయకులు వీరేంద్ర, దినేష్, వినోదులు పాల్గొన్నారు.

రైతుల పరిస్థితిపై అధికారులు ఆలోచించాలి

పాములపాడు: వర్షాభావ పరిస్థితుల్లో పైర్లు ఎండిపోతుండటంతో రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి అధికారులు ఆలోచించాలని రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జూలై నెలలో కురిసిన వర్షాల వల్ల రైలు పైర్లు సాగు చేశారన్నారు. వర్షం కురవకపోతే పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదని, అధికారులు రైతుల గురించి ఆలోచన చేసి వెంటనే ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల నుంచి కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ పోచా, ఏపీ శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి
- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి రెడ్డితో కలిసి పీరుసాహెబ్ పేటలో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరణ

మిడుతూరు: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మండలపరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో కలిసి ఎంపీ నిధుల(రూ. 9.96 లక్షలు)తో ఇందిరమ్మ కాలనీ సీసీ రోడ్డు, పీరుసాహెబ్ పేట – నాగలూటి గ్రామాలకు వెళ్లే పొలాల రస్తా (రూ. 25 లక్షలు) పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ దేశానికి ఆదర్శంగా నిలిచేలా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలు అందుబాటులో ఉండేలా వైఎస్సార్ ఆరోగ్య ఉపకేంద్రాలు, ఆర్‌బీకేలు, ఏర్పాటు చేశారని తెలిపారు. సచివాలయ వ్యవస్థతో ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పర్వత యుగంధర్‌రెడ్డి, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, గ్రామ సర్పంచ్ పాపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, నాయకులు చంద్రమౌళి, శ్రీధర్‌రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, పేరెడ్డి వెంకటరామిరెడ్డి, తువ్వా లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కళాశాల అధ్యాపకులు అబ్దుల్‌జబ్బార్ కోరారు. కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, 10వ తరగతి పాసై ఇంకా కళాశాలలో చేరని విద్యార్థులు తమ కళాశాలలో చేరాలని కోరారు. నిరుపేద విద్యార్థుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. తోటగేరి, అక్కిరాజు కాలనీ, జుమ్మా మసీదు తదితర కాలనీల్లో ప్రచారం నిర్వహించారు.

నగదు అప్పగింత

మహానంది: బెంగళూరుకు చెందిన శ్రీనాథ్, కుటుంబ సభ్యులు శనివారం మహానందీశ్వర స్వామి దర్శనానికి వచ్చారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారి దర్శనం అనంతరం వారు స్థానిక వినాయకనంది ఆలయం వద్దకు రాగా పర్సు పడిపోయింది. అందులో రూ.పదివేలు నగదు ఉందని, విషయాన్ని సమాచార కేంద్రం వద్ద అకామిడేషన్ ఇన్‌చార్జ్ ఈశ్వర్‌కు తెలిపారు. ఇదిలా ఉండగా పర్సు దొరికిన భక్తులు గిద్దలూరు వెంకట్రామిరెడ్డి సైతం సమాచార కేంద్రం వద్ద చెప్పి ఫోన్ నంబరు ఇచ్చి వెళ్లడంతో, ఫోన్ చేయగా ఆలయ సిబ్బంది చేత బాధితులకు నగదు అందించినట్లు చెప్పారు.

పుణ్యక్షేత్రాల్లో కళాకారుల ప్రదర్శనలు



మహానందికి వచ్చిన రాజమండి కళాకారులు

మహానంది: భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రాజమండ్రి నుంచి తిరుమల వరకు పుణ్యక్షేత్రాల్లో కళాకారులు పర్యటిస్తూ నృత్య ప్రదర్శనలు ఇస్తున్నట్లు డాక్టర్ జీబీ నారాయణ తెలిపారు. ఇందులో భాగంగా రాజమండ్రికి చెందిన కళాకారులు శనివారం మహానందికి వచ్చారు. స్థానిక అలంకార మండపంలో కళాప్రదర్శనలు, నృత్యాలు ప్రదర్శించారు. డాక్టర్ జీబీ నారాయణ మాట్లాడుతూ రాధాకృష్ణ ట్రస్ట్ వారు కేంద్ర ప్రభుత్వం సహకారంతో శృంగేరీ, కంచికామకోటి పీఠాధిపతుల ఆదేశాల మేరకు సుమారు 16వేల కిలోమీటర్లు పర్యటించి ప్రముఖ ఆలయాల్లో నృత్య ప్రదర్శనలు ఇస్తారన్నారు. అందులో భాగంగా మహానందికి ప్రదర్శించారని చెప్పారు. తిరుమలలో ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగే కార్యక్రమానికి ప్రధానమంత్రి మోదీ హాజరవుతారన్నారు. కళాకారులకు ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, పండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి అభినందనలు తెలిపారు.


ఓంకారంలో భక్తుల సందడి



అమ్మవారికి విశేషపూజలు చేసిన దృశ్యం

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వీకెండ్, సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ గంగా, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. అధిక శ్రావణ మాసం, మతత్రయ ఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకులు చక్రపాణిశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం భక్తులు స్థానిక కాశిరెడ్డినాయన అన్నదానం వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు.

వీబీఆర్‌కు చేరిన కృష్ణా జలాలు



పారుతున్న కృష్ణా జలాలు

వెలుగోడు: కృష్ణా జలాలు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వచ్చి చేరాయి. పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేయడంతో బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ మీదుగా వీబీఆర్‌కు 5 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. వీబీఆర్‌లో ప్రస్తుతం 1.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్‌కు నీరు వచ్చి చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జోరుగా నారు మడి పనులు ప్రారంభమయ్యాయి.

రేషన్ బియ్యం స్వాధీనం

నందికొట్కూరు: ప్రభుత్వం పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు తప్పవని టౌన్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని మద్దిగట్ల సమీపంలో శ్మశాన వాటిక వద్ద బొలెరో వాహనంలో 40 కేజీల బియ్యం బస్తాలు 70 రేషన్ ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే, వాటితో వ్యాపారం చేస్తే చట్ట పరంగా చర్యలు తప్పవన్నారు. పగిడ్యాల మండలం నెహ్రూనగర్ నుంచి వస్తునట్లు ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పట్టుకున్నామని చెప్పారు. 70 రేషన్ ప్యాకెట్లతో పాటు వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వెల్లడించారు.

మహిళల అదృశ్యం



బొగ్గుల సుష్మిత, ఫరీద

నందికొట్కూరు: పట్టణంలోని ఏబీఎం పాలెంకు చెందిన బొగ్గుల సుస్మిత అనే మహిళా కనిపించడం లేదని తల్లి సత్యవేదమ్మ శనివారం ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు. ఈ నెల 9వ తేదీన కర్నూలులోని స్నేహితులను కలిసి వస్తానని వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. అలాగే పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన ఫరీద అనే మహిళా కనిపించడం లేదని భర్త మౌలాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్వీ రమణ శనివారం తెలిపారు. ఈ నెల 10వ తేదీన జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామంలోని దర్గాకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. సమాచారం తెలిసివారు పోలీసు స్టేషన్‌కు 08513-280333 గల ఫోన్ నెంబరుకు తెలియజేయాలని కోరారు.

నాగలూటిలో అన్నదమ్ములు..



అదృశ్యమైన చరణ్, తేజ

మిడుతూరు: మండల పరిధిలోని నాగలూటి గ్రామానికి చెందిన అన్నదమ్ములు అదృశ్యమైనట్లు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతిశంకర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు నాగలూటి గ్రామానికి చెందిన వడ్డె వెంకటేశ్వరమ్మ, గోవర్ధన్‌కు ఇద్దరు కుమారులు చరణ్, తేజ సంతానం. గోవర్ధన్ అనారోగ్యంతో ఐదేళ్ల క్రితం చనిపోయాడు. ఇద్దరు కుమారులు దామగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చరణ్ (11) తొమ్మిదో తరగతి, తేజ (10) ఏడో తరగతి చదువుచున్నారు. 6వ తేదీన నందికొట్కూరు పట్టణానికి వెళ్లి సరుకులు తెచ్చుకొని ఇంటికి వచ్చే సరికి కుమారులు కనిపించకపోవడంతో చుట్టు పక్కల, బంధువులను విచారించింది. ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేసు నమోదు

మహానంది: బుక్కాపురం గ్రామానికి చెందిన అందె సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన సమీప బంధువులైన ఆరుగురు తన ఇంటి మీదికి వచ్చి వాకిళ్లు పగలగొట్టి, దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఈ మేరకు సంగీత, రామయ్యలతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మహానంది స్టేషన్‌లో..

మహానంది: జూన్ నెల 20వ తేదీన నంద్యాలకు చెందిన చినబాబు నందిపల్లె వద్ద రైలు కిందపడి మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తాజాగా శనివారం రైల్వేపోలీసుల ఆదేశాల మేరకు ఆత్మహత్య కేసు మహానంది పోలీస్‌స్టేషన్‌లో మరోసారి నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలం మహానంది పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో రైల్వేపోలీసులు కేసు నమోదు చేయాలని సూచించినట్లు చెప్పారు.

50 ఎకరాల్లో మొక్కజొన్న పైరు దున్నేసిన రైతు



ట్రాక్టర్ రొటావేటర్‌తో మొక్కజొన్న పైరును చెడగొడుతున్న దృశ్యం

పాములపాడు: వరుణుడి కరుణ కరువవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన రైతు 50 ఎకరాల్లో మొక్కజొన్న పైరును ట్రాక్టర్ రొటావేటర్‌తో దున్నేశాడు. 50 ఎకరాల పొలాన్ని రూ.5లక్షలు కౌలు చెల్లించి సాగు చేస్తున్నట్లు రైతు లింగస్వామి తెలిపారు. ఇప్పటికి విత్తనం వేయడానికి రూ.3లక్షలు ఖర్చయ్యిందని వాపోయారు. వర్షం కురవకపోవడంతో మొలకెత్తిన పైరు పెరుగుదల లేకపోవడంతో పంట చేతికొచ్చే పరిస్థితి కనిపించక పైరును దున్నేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు.

14న ప్రొద్దుటూరులో మహానందీశ్వరుడి కల్యాణం

మహానంది: ప్రొద్దుటూరులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 14న మహానందీశ్వరుడి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ లోకకల్యాణం కోసం ఆర్యవైశ్య సభ, దేవస్థానం ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కల్యాణోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

వివాదాస్పద ఇళ్ల స్థలాలపై విచారణ



గ్రామస్తులతో చర్చిస్తున్న ఆర్డీఓ ఎం. దాసు

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో వివాదాస్పదంగా మారిన ఇళ్ల స్థలాలపై ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీఓ) ఎం. దాసు విచారణ చేపట్టారు. శనివారం గ్రామ సచివాలయంలో గ్రామస్తులతో సమావేశమై చర్చించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఎస్సీ కాలనీకి సమీపాన పట్టాలు మంజూరు చేశారు. అయితే ఈ స్థలంలో బుడగజంగాలకు ఇదివరకే పట్టాలు మంజూరు చేశారని కాలనీకి చెందిన 13 మంది హైకోర్టులో పిటిషన్ వేశారు. ఏడాదికి పైగా ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం దొరకలేదు. అయితే పిటిషన్ వేసిన వ్యక్తులు కేసును విత్ డ్రా చేసుకోవడం వలన రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడానికి, అర్హుల జాబితాను ఎంపిక చేసేందుకు గ్రామసభను నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను ఆదివారం సాయంత్రంలోగా తమకు అందజేయాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామస్తులు ఇచ్చిన జాబితాపై మండల ఆర్ఐ, వీఆర్వో రీ వెరిఫికేషన్ చేసి రెండు రోజుల్లోగా ఆర్డీఓ కార్యాలయానికి తుది జాబితాను పంపాలని ఆదేశించారు. అలాగే ఓటర్ల జాబితాపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఈనెల 17లోగా పూర్తి చేయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం తూర్పు ప్రాతకోటలో బూత్ స్థాయి ఆఫీసర్లు నిర్వహించే ఇంటింటి సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, డిప్యూటీ తహసీల్దార్ మురళి, ఆర్ఐ సరళ, సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వో భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో వీకెండ్ సందడి



మహానందీశ్వరుడి సన్నిధిలో భక్తులు

మహానంది: వీకెండ్ కావడంతో పాటు సెలవురోజు ఉండటంతో మహానంది ఆలయం శనివారం భక్తులతో కళకళలాడింది. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా దర్శనం కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. రాత్రి ఏకాంతసేవ పూజలు వైభవంగా చేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మిడుతూరు: మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామంలోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయ ఆవరణలో శ్రీ ధన్వంతరి ఆయుర్వేదిక్, పంచకర్మ, ఫిజియోథెరపీ అండ్ క్షారసూత్ర హాస్పిటల్ కర్నూలు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు కమతం వీరారెడ్డి శుక్రవారం తెలిపారు. డాక్టర్ శివకుమార్ దండె (ప్రొఫెసర్), డాక్టర్ ఆర్ సర్ పాటిల్ ఎండీ(ఆయుర్వేదిక్), డాక్టర్ పీజీఎస్ రాజా, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జాగృతి తదితరులు రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కీళ్లవాతం, మోకాళ్ల నొప్పులు, నడుమునొప్పి, డిస్క్ సమస్యలు, మెడ నొప్పులు, బీపీ, షుగర్ బుద్ధి మాంద్యం, మానసిక వ్యాధులు డీవీటీ మొదలగు దీర్ఘకాలిక వ్యాధులకు పంచకర్మ వైద్యంపై అవగాహన కల్పిస్తారన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడిపై విచారణ

మహానంది: విద్యుత్ కోతలను నిరసిస్తూ గాజులపల్లె సబ్‌స్టేషన్‌ను గ్రామస్తులు గత రెండు దఫాలుగా ముట్టడించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాత్రి వేళల్లో నిరసన వ్యక్తం చేసేందుకు వచ్చిన వారిలో కొందరు కార్యాలయ ప్రాంగణంలోని కుర్చీలు, విద్యుత్ మీటర్లను ధ్వంసం చేశారు. ఈ విషయం స్థానిక సిబ్బంది విద్యుత్‌శాఖ మండల అసిస్టెంట్ ఇంజినీర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఏఈ ప్రభాకర్ రెడ్డి మహానంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు పోలీసులు శనివారం గ్రామానికి చేరుకుని వీడియోల ఆధారంగా వివరాలు సేకరించారు.

బయటపడిన సంగమేశ్వరాలయ శిఖరం



కొత్తపల్లి: మూడు రోజుల క్రితం కృష్ణాజల్లాల్లో మునిగిన సంగమేశ్వరాలయ శిఖరం మళ్లీ బయటపడింది. ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోవడం, అదే సమయంలో కల్వకుర్తి నుంచి విద్యుత్ ఉత్పత్తికి, పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సప్తనదుల సంగప్రాంతంలోని సంగమేశ్వరాలయ సమీపంలో వెనుకజలాలు తగ్గుముఖం పట్టడంతో ఆలయ శిఖరం మళ్లీ భక్తులకు దర్శనమిస్తోంది.

మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు

మహానంది: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మహానంది మండల పరిధిలోని గాజులపల్లె, శ్రీనగరం పరిసర ప్రాంతాల్లో రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న పలు వాహనాలను జరిమానాలు విధించారు. అనంతరం ఎస్ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ బైక్‌పై వెళ్లేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వివిధ రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానాలు విధించారు.

నూతన బోరు ఏర్పాటు

ఆత్మకూరు: మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు నూతన బోరును శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఇందిరేశ్వరం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మైనార్టీ కాలనీకి తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారని విన్నవించగా, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. నూతన బోరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్తబోరులో రెండించుల నీరు రావడంతో కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రెహమాన్ పాల్గొన్నారు.

టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ నూతన కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ వై మధుసూదన్ రెడ్డి

ఆత్మకూరురూరల్: పట్టణంలో నూతనంగా నిర్మించిన డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ వారి నూతన కార్యాలయాన్ని రాష్ట్ర ప్రధాన అటవీ సంరక్షణాధికారి మధుసూదన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అటవీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై వన్యప్రాణి సంరక్షణ విధానాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీటీ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ అలాన్ చోంగ్ టెరాన్, ఎఫ్ఆర్‌వోలు పట్టాభి, దొరస్వామి, రామకోటి పాల్గొన్నారు.